విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం
శ్రీ సత్యసాయి
5
గురువారం 7 మే 2026

# శ్రీ సత్య సాయి జిల్లా హైవే దోపిడీ కేసులో 10 మంది అంతర్ రాష్ట్ర ప్రధాన నిందితులు అరెస్ట్..

శ్రీ సత్య సాయి జిల్లా, మే 6 (అనంత ప్రభ )

శ్రీ సత్య సాయి జిల్లాలో రాప్తాడు కనగానపల్లి హైవేలో జరిగిన దోపిడీ కేసులో రెండు సంచలనాత్మకమైన హైవే దోపిడీ కేసులను ఛేదించి పదిమంది ముఠా సభ్యులను అరెస్టు చేయడంతో పాటు వారి నుండి కోటి 26 లక్షల నగదు మూడు కార్లు, 13, సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారు వెల్లడించారు.

బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన ఐపీఎస్ గారు, మరియు పెనుకొండ సి ఐ రాఘవన్ తో కలిసి ఎస్పీ గారు మీడియాకు తెలియజేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా హైవే దోపిడీ కేసులలో నిందితుల అరెస్టు మరియు ఆస్తి స్వాధీనంపై పత్రికా సమావేశం, తేది: 06.05.2026.

కిడ్నాప్, దోపిడీ మరియు నగదు దోపిడీకి పాల్పడే ఒక వ్యవస్థీకృత అంతర్రాష్ట్ర నేర ముఠా ఎన్ హెచ్-44 పై పాల్పడిన 02 సంచలనాత్మక హైవే దోపిడీ కేసులను శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు.

కేసుల సంక్షిప్త వివరణ;-

1) క్రైమ్ నెం. 84/2025 సెక్షన్ 126(2), 324(4), 140(2), 129(2), 310(2) బి ఎన్ ఎస్ ఆఫ్కియా పి ఎస్ పి ఎస్ -- 03.12.2025న ఉదయం సుమారు 03:07 గంటలకు ఎన్ హెచ్-44పై జరిగిన కిడ్నాప్ మరియు దోపిడీ కేసులో, గుర్తు తెలియని దుండగులు కదులుతున్న వాహనాన్ని అడ్డగించి, కిటికీలను పగలగొట్టి, వాహనంతో పాటు ఇద్దరిని బలవంతంగా అపహరించి, 2.8 కోట్లు దోచుకుని, ఆ తర్వాత బాధితులను వేర్వేరు ప్రదేశాలలో వదిలిపెట్టి వెళ్లారు.

2) క్రైమ్ నెం. 14/2026, సెక్షన్లు 126(2), 324(4), 140(3), 351(3), 303(2) మరియు 3(5) బి.ఎన్.ఎస్. కనగానపల్లి పోలీస్ స్టేషన్-- 21.02.2026న, సుమారు 8 మంది ముసుగు ధరించిన వ్యక్తుల ముఠా,ఎన్ హెచ్-



44పై మామిళ్లపల్లి గ్రామం సమీపంలో ₹3 కోట్ల నగదుతో వెళుతున్న వాహనాన్ని అడ్డగించి, అందులో ఉన్నవారిని లొంగదీసుకుని, అపహరించి, నగదు మొత్తాన్ని దోచుకుని బాధితులను వదిలిపెట్టి వెళ్ళిపోయారు.

ఈ రెండు కేసులలో కలిపి మొత్తం సుమారు ₹5.8 కోట్ల ఆస్తి దోచుకున్నారు.

నేర పద్ధతి;

ఈ ముఠా హైవేలపై లక్షిత వాహనాలను అడ్డగించడానికి నకిలీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు గల అనేక వాహనాలను ఉపయోగించింది. వారు వాహనాల కిటికీలను పగలగొట్టి, సహాయం కోసం చేసే కాల్స్‌ను నివారించడానికి మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, బాధితులను అపహరించి, వారిని నిర్జన ప్రదేశాలకు తరలించి వదిలిపెట్టి వెళ్ళిపోయారు.

ముందస్తు ప్రణాళిక, బాధ్యతల విభజన మరియు వృత్తిపరమైన అమలును స్పష్టంగా సూచిస్తూ, కార్యకలాపాలు నిమిషాల వ్యవధిలోనే పూర్తయ్యాయి. ఫాస్టాగ్ ట్రాకింగ్‌ను నివారించడానికి టోల్ చెల్లింపులు కేవలం నగదు రూపంలోనే జరిగాయి. దర్యాప్తు మరియు గుర్తింపు;-

పోలీసు బృందాలు కర్నూలు, మదనపల్లె, బెంగళూరు మరియు సేలం మధ్య ఉన్న 200 కిలోమీటర్లకు పైగా ఎన్ హెచ్-44 రహదారి మరియు టోల్ ప్లాజాల నుండి సిసి టివి ఫుటేజీని విశ్లేషించాయి. నకిలీ నంబర్ ప్లేట్లను ఉపయోగించి అనుమానాస్పద వాహనాలను గుర్తించారు.

అనేక సిమ్ కార్డుల యొక్క సిడి ఆర్ , ఐ పి డి ఆర్ , మరియు ఐ ఎం ఇ ఐ డేటా యొక్క సాంకేతిక విశ్లేషణలో, నిందితులు కేరళ నుండి నకిలీ సిమ్ కార్డులను కొనుగోలు చేసి ఉపయోగించారని మరియు సాంప్రదాయ ట్రాకింగ్‌ను తప్పించుకోవడానికి మోటో జి35 మొబైల్ ఫోన్‌లను ఉపయోగించి వి ఓ ఐ పి సేవల ద్వారా సంభాషించుకున్నారని వెల్లడైంది.

తదుపరి దర్యాప్తులో, ఈ ముఠా నేరానికి పాల్పడటానికి ముందు కేరళ నుండి తమిళనాడు మరియు కర్ణాటక మీదుగా ప్రయాణించిందని, మరియు ముందస్తు నిఘా మరియు ప్రణాళిక కోసం తమిళనాడులోని ధర్మపురిలో ఉన్న లాడ్జీలలో బస చేసినట్లు నిర్ధారించబడింది.

ముఠా నిర్మాణం;

ఈ ముఠాలో ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర మరియు మధ్యప్రదేశ్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 21 మంది నిందితులు ఉన్నారు. ప్రధాన సూత్రధారి అంతర్జాతీయ వి ఓ ఐ పి కమ్యూనికేషన్‌ను ఉపయోగించి నేపాల్ నుండి కార్యకలాపాలను సమన్వయం చేశాడు.

ఆరు రాష్ట్రాల్లోని అనేక సారూప్య కేసులలో వారి ప్రమేయం, అత్యంత వ్యవస్థీకృతమైన అంతర్రాష్ట్ర నేర ముఠా ఉనికిని నిర్ధారిస్తుంది.

నిందితుల అరెస్టు;-

ఇప్పటివరకు ఉన్న 21 మంది నిందితులలో, 03 మందిని 15.03.2026న అరెస్టు చేయగా, మిగిలిన 07 మంది కీలక నిందితులను 05.05.2026న అరెస్టు చేశారు

## రాయలసీమ ఎత్తిపోతల పథకం తెలంగాణ కి తాకట్టు





- ఎత్తిపోతల పథకం పనులు ఆపివేయడంలో.. తెదేపా అంతర్యం ఏమిటి
- రైతుల సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వ మోసం
- వ్యాలీ రిసార్ట్లో కూటమిపై మండిపడ్డ జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్ రెడ్డి

కూడేరు, మే 6 (అనంత ప్రభ)

రాయలసీమ ఎత్తిపోతల పథకం పై "చంద్రబాబు మోసం మోసం" పేరుతో తిరుపతి, పీలేరు లో లేక్ వ్యాలీ రిసార్ట్లో వైసిపి నిర్వహించిన సదస్సు కు బుధవారం రోజున వైసిపి జోనల్ ఇంచార్జ్ యువనేత ప్రణయ్ రెడ్డికి హాజరయ్యారు. ఈ సదస్సులో వైసిపి రాష్ట్ర యువనేత, జోనల్ ఇంచార్జ్ వై . ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల ప్రయోజనాల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు రాయలసీమ జిల్లాల శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి 80 శాతం పనులు పూర్తి చేయడం జరిగింది. కానీ మిగిలిన 20 శాతం పనులను ఈనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిగిలిన పనులను నిలుపుదల చేసి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తాకట్టు పెట్టి రాయలసీమ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుకు పనులను పునః ప్రారంభించాలని వైసీపీ యువనేత వై. ప్రణయ్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యార్థి విభాగం నాయకులు, మాజీ మంత్రివర్యులు సాకే శైలజనాథ్ హాజరయ్యారు.

## నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కేరళ కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

అనంతపురం, మే 6 (అనంత ప్రభ )

అనంతపురం డిసిసి జిల్లా అధ్యక్షుడు వై.మధు సూధన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అనంతపురం నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 102 స్థానాలలో ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ గారి నాయకత్వంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ టపాసులు కాల్చి, కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంతోషంతో సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో నిర్వహించిన సమావేశంలో కేరళ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ 102 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని వాయనాడు పార్లమెంట్లో ఏడు నియోజకవర్గాల్లో క్లీన్ స్వీప్ చేసి ఘన విజయం సాధించిందన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నాయకుల్లో నూతన ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున తమ ఓట్ల ద్వారా మార్పుకు స్వాగతం పలికారు కాంగ్రెస్ పక్షాన నిలిచారు. అదేవిధంగా రాహుల్ గాంధీ గారు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కూడా పెద్ద ఎత్తున యువత తరలివచ్చి వారి మద్దతు తెలిపారు. దేశంలో కానీ లౌకిక తత్వ పార్టీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కేరళ ఎన్నికల్లో



బిజెపి మతతత్వ పార్టీకి ఓటర్లు గట్టిగా బుద్ధి చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు హాసిన్ వలి, ముజమ్మిల్, కడియాల జాకీర్, యూసుఫ్, ఇర్షాద్, నరసింహారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, ఓబుళపతి, పింది భాష, సుధాకర్, కార్యకర్తలు రాజు, హరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు

## మరణానంతర సేవలకూ గౌరవం -- ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక మార్చురీ ఫ్రీజర్ ఏర్పాటు

ధర్మవరం, మే 6 (అనంత ప్రభ )

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిని సమగ్ర వైద్య సేవల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దృఢసంకల్పంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి మరియు ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ప్రతి చిన్న సమస్యను గుర్తించి, దానికి తక్షణ పరిష్కారం చూపిస్తూ ప్రజానాయకుడిగా మంత్రి నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ సదుపాయాల కొరతను గమనించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, వెంటనే స్పందించి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఙాామీాా×ణజ) ద్వారా రూ.3,71,700/- లక్షల వ్యయంతో ఆధునిక సాంకేతికత కలిగిన రెండు మృతదేహాల సామర్థ్యం గల స్టెబిలైజర్‌తో కూడిన మార్చురీ ఫ్రీజర్‌ను ఏర్పాటు చేయించారు. ఇది ఆసుపత్రి సేవల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బుధవారం ఈ మార్చురీ ఫ్రీజర్ ఏర్పాటు కార్యక్రమాన్ని హరీష్ బాబు స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో మార్చురీలో సదుపాయాల కొరత కారణంగా మృతదేహాలను భద్రపరచడంలో ఇబ్బందులు ఎదురయ్యేవని, ముఖ్యంగా ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని తెలిపారు. ఇప్పుడు మంత్రి చొరవతో ఏర్పాటైన ఈ ఆధునిక ఫ్రీజర్ వల్ల ఆ సమస్యలకు పూర్తిసా-




ధయిలో పరిష్కారం లభించిందని చెప్పారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో లేదా ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చిన సందర్భాల్లో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రపరచుకునే సౌకర్యం కల్పించబడడం ద్వారా ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందేలా మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ముందుగానే అంచనా వేసి, వాటికి అనుగుణంగా సదుపాయాలు కల్పించడం మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వ ప్రత్యేకత అని, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్రంలో ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ధర్మవరం ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రజలకు నమ్మకాన్ని కలిగించే విధంగా సదుపాయాలు మెరుగుపడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ తిప్పేంద్ర నాయక్, బీజేపీ నాయకులు బిల్లే శ్రీనివాసులు, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోషిని దస్తగిరి నిఖా కార్యక్రమాని హాజరైన కొండే కంటి నబి రసూల్

తాడిపత్రి , మే 6 (అనంత ప్రభ )

గుంటూరు టౌన్ పెద్ద పలకలూరు రోడ్డు దగ్గర,వి, కన్వేన్షన్ లో రోషిని దస్తగిరి నిఖా కార్యక్రమానికి ముఖ్య అతిథులు విచ్చేసిన ఆర్ టి ఐ జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు దూదేకులసేవా సంఘం మాజీ ప్రెసిడెంట్ గౌరవ అధ్యక్షులు కొండే కంటి నబి రసూల్ , నగర జిల్లా అధ్యక్షులు ఆదం షఫీ, నూతన వదువరులకు దంపతులకు ఆశీస్సులు అందజేశారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సేవా సంఘం గౌరవ



అధ్యక్షులు డి బాబు బాషా, కార్యవర్గ సభ్యులు డి బాబా ఫక్రుద్దీన్ హాజీ వలి మస్తాన్ సాగర్ హుస్సేన్ రఫీ అబ్దుల్ రజాక్, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టిడిపి నాయకులు



యాడికి, మే 6 (అనంత ప్రభ )

అనంతపురం జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి కుమార్తె శ్రీ రమ్య,లీల సాయి కుమార్‌ల వివాహ వేడుక గుంతకల్ పట్టణంలో వైభవంగా జరిగింది. ఈ వివాహానికి యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, యాడికి టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో బంధుమిత్రులు, ఆహ్వానితులు, పలువురు ప్రముఖులు, అధికారులు కూడా విచ్చేసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు

## యాడికి పీహెచ్సీలో టిబి గుర్తింపు కోసం ప్రత్యేక వైద్య శిబిరం



యాడికి, మే 6 (అనంత ప్రభ )

టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని డాక్టర్ పరమ-ేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీబీ వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించడం, అలాగే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులపై అవగాహన పెంచడం లక్ష్యంగా 14 సంవత్సరాలు దాటిన ప్రజలందరికీ ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. అలాగే ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో కూడా ఉచిత ఎక్స్‌రే పరీక్షలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్, మద్దిలేటి, సునీల్, నాగరాజు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



అనంతపురం, మే 6 (అనంత ప్రభ )

అనంతపురం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఉభయసభల మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన మైనారిటీల సంక్షేమ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఛైర్మన్ మహ్మద్ నజరీ అహ్మద్ గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మైనార్టీల అభ్యున్నతి కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఇందులో ప్రధానంగా గత ఏడాది హజ్ యాత్రకు ఎంత మంది వెళ్లారు... రాష్ట్రంలో ఉన్న మసీదుల్లో ఇమామ్ లు మౌజీన్లకు ఎంత మందికి గౌరవ వేతనాలు అందాయి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లాలోని మైనార్టీల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మసీదులు, ఈద్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, అలాగే మౌజీన్లు, ఇమామ్ ల వేతనాలు ఇతర వాటి గురించి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వారికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ పథకాలు చాలా వరకు రాష్ట్రంలో అమలు కాకపోవడం వలన వారికి తగిన న్యాయం జరగడం లేదన్నారు. గతంలో రంజాన్ తోఫా, షాదీ తోఫా, విదేశీ విద్య వంటివి క్రమం తప్పకుండా అందించే వారన్నారు. గత వైసిపి పాలనలో అవి అమలుకాక చాలా మంది ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ పథకాలను ప్రస్తుతం మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ సమావేశంలో ముస్లిం,ఎ మైనార్టీలకు సంబంధించిన అన్ని అంశాలు చర్చించామన్నారు. వారికి రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలయ్యే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు స్పష్టం చేశారు.




## అంతర్జాతీయ నర్సుల దినోత్సవ సందర్భంగా నర్సులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు



కూడేరు, మే 6 (అనంత ప్రభ)

నేడు గ్లోబుల్ ప్రపంచంలో వాతావరణం లో చోటు చేసుకుంటున్నా...మార్పుల కారణంగా నిత్య జీవితంలో సహజంగా ఏదో రకంగా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మొట్టమొదట గుర్తుకు వచ్చేది డాక్టరు అయితే, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ గా ప్రజలకు వైద్య సేవలను అందిస్తూ బాధితులకు మనోధర్యాన్ని నింపుతూ ఆచరణలో ఉత్తమ వైద్య సేవలను అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న నర్సులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుదాం... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి నర్సులు ప్రజల యొక్క ప్రాణాలను కాపాడాలని లక్ష్యంతో ప్రజల సేవలకు అంకితమై నిరంతరం ప్రజల మధ్యనే ఉంటు ప్రజలకు వైద్యాన్ని అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని రంగాలలో ప్రధానమైనది వైద్యరంగం ప్రజలకు వైద్యాన్ని అందించడంలో నర్సుల యొక్క పాత్ర చాలా ముఖ్యమైనది. దేశవ్యాప్తంగా కరోనా సమయంలో ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే బయటికి అడుగు పెట్టాలంటేనే (వెళ్లాలంటేనే) భయపడుతున్న తరుణంలో నర్సులు ధైర్యంగా ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం వైద్య వృత్తిలో తరిస్తూ ప్రజల శ్రే-యస్సే లక్ష్యంగా ఆఖరి క్షణం వరకు పోరాడి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన నర్సుల అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ సందర్భంగా నర్సుల అందరిని ప్రత్యేకంగా గౌరవిస్తూ, అభినందించాల్సిన బాధ్యత కర్తవ్యం ప్రతి ఒక్కరు పైన ఉంది. ఈ సందర్భంగా నర్సులు అందరికీ దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తూ ప్రజలకు మరిన్ని వైద్య సేవలను అందించాలని కోరుకుందాము

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి 5 లక్షల బీమా సహాయము



యాడికి, మే 6 (అనంత ప్రభ)

కార్యకర్తల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అన్నారు. యాడికి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎం అంకాలు ప్రమాదవశాత్తు మృతిచెందగా, ప్రమాద బీమా కింద రూ.5 లక్షల సాయం ఆయన భార్య లక్ష్మీదేవి ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వేలూరు రంగయ్య, మండల కన్వీనర్ దడియాల ఆది,మాజీ మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందించడం దేశంలోనే తొలి ప్రయత్నమని పేర్కొన్నారు. కార్యకర్తల పిల్లల విద్య, స్వ-యం ఉపాధి,కెరీర్ గైడెన్స్,ఉపాధి అవకాశాల కల్పనలో పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.నారా లోకేష్ నుంచి వచ్చిన బీమా చెల్లింపు సమాచార లేఖను లక్ష్మీదేవికి అందజేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబాన్ని ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్,ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి మరియు యాడికి మండల టిడిపి నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలాంజనేయులు, రూపునేని రాజశేఖర్, బొట్టు శేఖర్, సుభాన్, హాజీ పీరా, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం



యాడికి, మే 6 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి. ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయము 1లో యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లావణ్య, డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు నిర్వహించారు. వడదెబ్బ నివారణ, పరిసరాల పరిశుభ్రత, చిన్నారులకు వేయాల్సిన టీకాల ప్రాముఖ్యతపై మహిళలకు వివరించారు.

అలాగే గర్భిణీలు ప్రసవాల కోసం తప్పనిసరిగా 108 అంబులెన్స్ సేవల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం వచ్చిన వెంటనే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని మేల్ హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇఓ లక్ష్మన్న, మేల్ సూపర్వైజర్ నారాయణ, మేల్ హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఏఎన్ఎంలు మరియమ్మ, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన భవన నిర్మాణమునకు భూమి పూజ చేసిన జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు.



కర్నూలు, మే 6 (అనంత ప్రభ )

కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన భవన నిర్మాణమునకు ఈరోజు కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఆధ్వర్యంలో నగరంలోని సి క్యాంప్ సెంటర్ సమీపంలో ఉన్న ఆర్ అండ్ బి కార్యాలయం ప్రక్కన ఖాళీ స్థలంలో భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, శాసనసభ్యుడు బొగ్గుల దస్తగిరి, శాసనమండలి సభ్యుడు బీటీ నాయుడు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు మీనాక్షి నాయుడు (ఆదోని), వైకుంఠం జ్యోతి (ఆలూరు), ఎన్ రాఘవేంద్రారెడ్డి (మంత్రాలయం) పాల్గొన్నారు. అలాగే కూడ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మున్నప్ప, జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ హాజర-య్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ సంజీవ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు కైపా పద్మలత రెడ్డి, ధరూర్ జేమ్స్, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు నంద్యాల నాగయ్య, ఎల్వీ ప్రసాద్, ముంతాజ్ మన-్సార్, సందీప్, సంజీవలక్ష్మి, పోతురాజు రవి కుమార్, విజయకుమార్, రామకృష్ణ, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు. ఇంకా డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, బత్తిన వెంకటరాముడు, రాజశేఖర్ రెడ్డి, కే భూపాల్ చౌదరి, ఉమాపతి నాయుడు, ఎస్ అబ్బాస్, ఎస్ కే బషీర్, నంది మధు, జిక్కియ అన్సారీ, అక్షయ కుమారి, సోమిశెట్టి శ్రీకాంత్, చంద్రశేఖర్, సోమిశెట్టి నవీన్, వాహీద్, రవికుమార్, భూపాల్ నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, సలీం, మాదాసి ఎల్లప్ప, చంద్రకాంత్, రవిచంద్ర శర్మ, మల్లెల పుల్లారెడ్డి, పి హనుమంతరావు చౌదరి, చిన్న మారన్న, నంది మధు, గున్నా మార్క్, సత్రం రామకృష్ణుడు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నూతన కార్యాలయం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మరియు పార్టీ పెద్దల సహకారంతో త్వరలోనే పూర్తి చేసి నాయకులు, కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకువస్తామని గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు.

## పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం, ప్రజలకు తాగునీటి కష్టాలు




బుక్కరాయసముద్రం, మే 6 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం పంచాయతీ గాంధీనగర్ కాలనీ నందు ప్రజలు తాగు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వరికూటి కుళ్లాయప్ప అన్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజలకు త్రాగునీటి కష్టాలు సృష్టిస్తున్నారని పంచాయతీ అధికారులపై ఆయన మండిపడ్డారు. గత సంవత్సర కాలంగా గాంధీ నగర్ కాలనీ నందు వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని అలాగే డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని బోరు నీరు సరిగా రావడం లేదని ఆయన అన్నారు. అధికారులు సాయిబాబా ప్రాజెక్ట్ తాగునీటిని అందిస్తామని అయితే థాంక్యూ కచ్చితంగా ఉండాలని పంచాయతీ అధికారులు చెప్పడంతో మండల ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వరికూటి కుళ్లాయప్ప సమస్యను ఎంపీడీవో దృష్టి తీసుకువెళ్లారు. గాంధీనగర్ కాలనీ నందు ఉన్నటువంటి సమస్యలైన త్రాగునీటి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అన్నారు.

## కురుబ సంఘం అధ్యక్షులు గా పట్నం నగేష్



అనంతపురం, మే 6 (అనంత ప్రభ )

అనంతపురం ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్ర బీసీ శాఖ మంత్రివర్యులు సవితమ్మ గారు. సింగనమల నియోజకవర్గం కురువ సంఘం అధ్యక్షులు పట్నం నగేష్ గారిని గౌరవ అధ్యక్షులు చెదల నారాయణస్వామి గారిని జనరల్ సెక్రెటరీ బుల్లె ఉజినప్ప గారిని సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆవులు కృష్ణయ్య బిల్లే నారాయణస్వామి. బండి ఆదినారాయణ సర్పంచ్ మల్లికార్జున. ఓబుళపతి.పట్నం వెంకన్న. కాంట్రాక్టర్ రామకృష్ణ. నీళ్లపాలు శ్రీనివాసులు. బండి ఎర్ర స్వామి.గంగాధర శాంత కుమార్. తదితరులు పాల్గొన్నారు

## మరణించిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు



అస్పరి, మే 6 (అనంత ప్రభ )

ఆస్పరి మండలానికి చెందిన 1990 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థి చిగలి రంగన్న ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. ఈ క్రమంలో పూర్వ విద్యార్థిని శ్రీమతి చంద్రకళ తన వంతు సహాయంగా రూ.20,000 నగదును రంగన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి హనుమంతు సహా ఇతర సహచరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చంద్రకళ చేసిన సహాయాన్ని స్థానికులు అభినందించారు

## ఆదోని గ్రామీణ మండల పరిధిలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మరిది సేవాభావం



ఆదోని , మే 6 (అనంత ప్రభ )

ఆదోని గ్రామీణ మండల పరిధిలో పేద ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే వే. సాయిప్రసాద్ రెడ్డి మరిది తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఆదోని మండల పరిధిలోని బాసర కోడు గ్రామానికి చెందిన మారమ్మ భర్త మృతి చెందడంతో ఆమె కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలుసుకున్న సాయిప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నగదు అందజేసి తమ మనసున్నతిని చాటుకున్నారు. అదేవిధంగా, భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.తమ కష్టకాలంలో పెద్దన్నలా ఆదుకున్నందుకు బాధిత కుటుంబ సభ్యులు సాయిప్రసాద్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పేదల పట్ల ఉన్న ఈ విధమైన సేవా భావం ప్రజలలో ఆయనపై మరింత విశ్వాసాన్ని పెంచుతోంది.స్థానిక ప్రజలు కూడా ఆయన చేసిన సహాయాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.







# నిమ్మరసం రోజూ తాగితే.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



పసుపు పచ్చని రంగులో నిగనిగలాడే నిమ్మ ప్రకృతి మనకు ప్రసాదించిన ఓ అద్భుతమైన వరం. ఈ పుల్లటి, గుండ్రని పండులో ప్రోటీన్, కొవ్వు, విటమిన్ సి, కాల్షియం, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాల పవర్‌హౌస్. పోషకాలతో నిండి ఉన్న నిమ్మ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తాయి, మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తాయి. శరీర కణజాలం పెరుగుదల, అభివృద్ధి, మరమ్మత్తుకు విటమిన్ సీ కీలక పాత్ర పోషిస్తుంది. వేసవిలో నిమ్మరసం.. బెస్ట్ రిఫ్రెష్ డ్రింక్ అని చెప్పొచ్చు. నిమ్మరసం రోజూ తీసుకుంటే.. మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది గొంతును శుభ్రపరుస్తుంది, మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మీరు గొంతు నొప్పితో బాధపడుతుంటే.. ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లలో అరస్పూన్ తేనె, స్పూన్ నిమ్మరసం కలిపి తాగితే మీకు త్వరగా ఉపశమనం లభిస్తుంది.

కిడ్నీలో రాళ్లను దూరంగా ఉంచుతుంది..

నిమ్మరసం మూత్రంలో సిట్రేట్ స్థాయిలను పెంచి.. మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తుంది. సిట్రేట్ కాల్షియంకు అతుక్కుంటుంది, ఇది మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా సహాయపడుతుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది..

నిమ్మరసం, నిమ్మ తొక్కలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది లివర్‌లో జీర్ణ ఎంజైమ్‌ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుంది. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉన్నవారు నిమ్మరసం తీసుకుంటే చాలా మంచిది. నిమ్మరసం మీ శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. (%ఊఝుస్త్రవ

%బ్లడ్ షుగర్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది..

నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్‌ని అదుపులో ఉంచుతుంది.. తద్వారా చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి. నిమ్మరసం తీసుకుంటే డయాబెటిస్ వచ్చే ముప్పు తగ్గుతుంది. షుగర్ పేషెంట్స్ రోజూ నిమ్మరసం తాగితే.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి.

బరువు తగ్గుతారు..

నిమ్మకాయలో పెక్టిన్ ఉంటుంది. నిమ్మరసం మీకు కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది.. దీనిలో ఉండే లో డెన్సిటీ ఫైబర్ శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించడానికి, బరువు తగ్గించడానికి సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి..

ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది..

నిమ్మకాయల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ సి మన శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సి వాపును తగ్గిస్తుంది, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. గాయాలు వేగాంగా మానేలా తోడ్పడుతుంది. నిమ్మరసం యాంటీ ఆక్సిడెంట్ల అద్భుతమైన మూలం. ఇది ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా.. మీ కణాలను రక్షించి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది



# కొబ్బరి నూనెలో ఇది కలిపి రాస్తే చుండ్రు తగ్గి జుట్టు బాగా పెరుగుతుంది..

జుట్టు అందంగా, షైనీగా ఉంటే ఆ అందం అంత ఇంత కాదు. చూడ్డానికి అందమైన జుట్టు కావాలని అందరికీ ఉంటుంది. కానీ, అనేక కారణాలతో చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతుంటారు. అందులో జుట్టు రాలడం, చిట్లిపోవడం, చుండ్రు సమస్యలు ఉంటాయి. అయితే, ఇందులో చుండ్రు సమస్య దూరమవ్వాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

కర్పూరం..

కర్పూరాన్ని చాలా మంది తమ ఇళ్ళలో వాడుతుంటారు. దీని వల్ల జుట్టుకి కూడా మేలు జరుగుతుంది. కర్పూరాన్ని కొబ్బరినూనెలో కలిపి రాయడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో చూద్దాం.

చుండ్రు..

కొబ్బరి నూనె, కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల అది బలమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ రెండింటికి కలయిక వల్ల స్కాల్ఫ్ ఫంగస్, బ్యాక్టీరియా, దురద, అలర్జీలు దూరమవుతాయి.

పేలు..

చాలా మంది పేల సమస్యతో తెగ ఇబ్బంది పడతారు. కర్పూర నూనె ఆ సమస్యకి కూడా చెక్ పెడుతుంది. కర్పూరంలోని యాంటీ పరాసిటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పేలను దూరం చేస్తాయి. దీని కోసం రెండు చెంచాల కొబ్బరి నూనె, ఓ చెంచా కర్పూరాన్ని కలిపి పేస్టులా చేసి తలకి పట్టించి రాత్రంతా అలానే ఉంచి క్లీన్ చేసుకోవాలి.

జుట్టు రాలడం దూరం..

చాలా వరకూ చుండ్రు ఎక్కువగా ఉండడం వల్లే జుట్టు రాలుతుంటుంది. అలాంటప్పుడు కొబ్బరినూనెలో కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల జుట్టు సమస్యలు దూరమై జుట్టు బలంగా మారత్నుంది.

తెల్ల జుట్ట దూరం..

కర్పూరం, కొబ్బరినూనె జుట్టు పెరుగుదలలో వచ్చే సమస్యల్ని దూరం చేసి పొడవుగా, మందమైన జుట్టుని పొందేందుకు సాయపడుతుంది. ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడే సమస్యని కూడా దూరమవుతుంది.

జుట్టుకి మెరుపు..



కొంతమంది జుట్టుని చూస్తే నిర్జీవంగా మారి ఇబ్బందిగా కనిపిస్తుంది. ఇలాంటి సమస్య దూరమ-య్యేందుకు, జుట్టు మృదువుగా మారేందుకు కర్పూర నూనె బాగా హెల్ప్ అవుతుంది.

ఎలా వాడాలి..

మీకు ఎంత నూనె అవసరమో అది తీసుకుని అందులో ఒకటి లేదా రెండు కర్పూర బిళ్ళలను వేయాలి. మొత్తం కరిగాక దానిని జుట్టుకి అప్లై చేయాలి. దీని వల్ల తల చల్లగా అనిపిస్తుంది. స్కాల్ప్ సున్నితంగా మారతుంది. అలా రాశాక.. 4 గంటలు వీలైతే రాత్రంతా ఉంచండి. ఇలా వారానికి 2 నుంచి 3 సార్లు చేయండి. దీంతో బెస్ట్ బెనిఫిట్స్ మీ సొంతమవుతాయి.

# ఈ మూలికతో రక్తంలో యూరిక్ యాసిడ్స్ తగ్గుతాయట..

ఆయుర్వేదంలో ఎన్నో మూలికలు ఉన్నాయి. వీటిని అనేక సమస్యలకి పరిష్కారంగా పనిచేస్తాయి. వీటిలో ఎక్కువగా తులసి, తిప్పతీగ, అశ్వగంధ గురించే తెలుసు. కానీ, తెలుసుకోవాల్సిన మరో మూలిక కూడా ఉంది. అందులో ఒకటే నేల ఉసిరి.

ఆయుర్వేద నిపుణుల ప్రకారం..

నేల ఉసిరి లివర్, కిడ్నీ సమస్యలకి చక్కని పరిష్కారమని నోయిడా %జు%-260 సెక్టార్ 27లోని కపిల్ త్యాగి ఆయుర్వేద క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కపిల్ త్యాగి చెబుతున్నారు. దీనిని తీసుకోవడం వల్ల మరిన్ని లాభాలు కూడా ఉన్నాయని, జీర్ణక్రియ, ఇమ్యూనిటీ బలంగా మారుతుందని చెబుతున్నారు.

నేల ఉసిరి అంటే..

ఈ నేల ఉసిరి ఇప్పుడు కాదు.. సుమారు 2 వేల సంవత్సారకు ముందే ఆయుర్వేదంలో వాడారని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీని మొక్క చూడ్డానికి సన్నని ఆకులతో కొమ్మలతో నిండి ఉంటుంది. ఇది సుమారు 2 అడుగుల వరకూ పెరుగుతుంది. కేవలం ఈ మొక్క ఆకుల్నే కాదు పువ్వులు, కాండాన్ని కూడా అనేక రకాలుగా ఉపయోగిస్తారు.

కిడ్నీ సమస్యలు దూరం..

ఈ ఆయుర్వేద మూలికని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు తగ్గిపోతాయి. ఇందులోని ప్రత్యేక గుణాలు రాళ్ళని బ్రేక్ చేస్తాయి. అందుకే, దీనిని 'స్టోన్ బ్రేకర్' అంటారు. ఈ మూలికలోని ఆల్కలీన్ కిడ్నీలోని రాళ్ళని తగ్గిస్తుంది. మూత్ర విసర్జనని పెంచుతుంది. ఇతర మందుల కంటే దీనిని తీసుకోవడం వల్ల మందులా పని చేస్తుంది.

పిత్తాశయ రాళ్ళు కూడా..

దీనిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు మాత్రమే కాదు. పిత్తాశయ రాళ్ళు కూడా దూ-రమవుతాయి. ఇందులోని ఆల్కలీన్ గుణాలే దీనికి కారణం. దీనిని ఈ సమస్యలకి పరిష్కారంగా కొన్ని రోజులుగా వాడుతున్నారు.

%నూశ్రీంశీ =ఝు౧% : వీటిని తింటే గ్యాస్, మలబద్ధకం దూరమవుతాయి..

అల్సర్స్..

అల్సర్స్..

నేల ఉసిరి తీసుకోవడం వల్ల కడుపులోని అల్సర్స్ దూరమవుతాయి. కడుపులోని బ్యాక్టీరియాని దూరం చేసేందుకు ఇవి బాగా పనిచేస్తాయి. కడుపులోని సమస్యల్ని దూరం చేసేందుకు ఈ మూలిక బాగా పనిచేస్తుంది.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..



యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పుష్కలంగ ఉన్న నేల ఉసిరిని తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల డయాబెటిక్ పేషెంట్స్‌కి మంచిదని చెబుతున్నారు నిపుణులు. అయితే, దీనిని మీరు డాక్టర్ సలహాతోనే తీసుకోవాలని గుర్తుపెట్టుకోండి.

యూరిక్ యాసిడ్స్..

రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు గౌట్ సమస్య వస్తుంది. అలాంటి సమస్యని ఈ మూలిక దూరం చేస్తుంది. దీనిలో యాంటీ గౌట్ లక్షణాలు ఉంటాయి. వీటితో పాటు దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే ఆర్థరైటిస్ లక్షణాలు కూడా తగ్గుతాయి.

లివర్‌కి మంచిది..

లివర్ ఆరోగ్యాన్ని కాపాడడంలో నేల ఉసిరి ఆయుర్వేద టానిక్ అని చెప్పొచ్చు. దీనిని లివర్ ఆరోగ్యాన్ని కాపాడి, పిత్తాశయ పనితీరుని మెరుగుపరుస్తుంది.

ఇతర లాభాలు..

దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థని మెరుగుపరిచి బలంగా తయారవుతుంది. ఇమ్యూనిటీ పెరుగుతుంది. స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమై, కఫ, పిత్త దోషాలని బ్యాలెన్స్ చేస్తుంది.

ఎలా వాడాలి..

ఈ మూలికను పొడి, రసం, పేస్ట్ రూపంలో ఎలా అయినా తీసుకోవచ్చు. అయితే, డాక్టర్, ఆయుర్వేద నిపుణుల సలహాతోనే తీసుకోవాలి. వారు మిమ్మల్ని పరీక్షించి ఎంత తీసుకోవాలి.. ఎలా తీసుకోవాలో చెబుతారు. అప్పుడే మీ సమస్యలన్నీ దూరమవుతాయి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com